ఒకసారి ఏం జరిగిందంటే!

# తనకుమాలిన ధర్మం

జి.వి.ఎల్.ఎన్. స్వామి




మావూళ్ళో మెయిలు, సాయం కాలం అయిదు, ఆరు గంటల మధ్య వస్తుంది. అదే మాకు ఆదివారం మంచి కాలక్షేపం. మా స్నేహబృందం మొత్తం ఆరుగురం. అందులో వాసుది ఓ ప్రత్యేక ప్రవృత్తి. వాడు మాట్లాడేది తక్కువ, చేతలు ఎక్కువ. ఆలోచన తక్కువ, ఆవేశం ఎక్కువ. తరుచుగా వాడివల్ల ఏవేవో సమస్యలు వస్తూం టాయి మాకు.

ఆ రోజు ఆదివారం అవడంవల్ల, అందరం రైల్వే స్టేషనుకు బయల్దేరి వెళ్ళాం. మెయిలు దూరం నుంచి వచ్చేస్తున్నది. అది రాగానే అందులో వున్న ప్రయాణీకుల గురించి అనేక వ్యాఖ్యానాలు చేయడం మాకున్న ఓ దురలవాటు. మా వాసు ఎందుకో తీక్షణంగా ఒకవైపు చూస్తున్నాడు. ఇంజను పక్క నుంచి, ఒక పంజాబీ డ్రస్‌లో వున్న తెల్లటి అమ్మాయి మెళ్ళో వేనిటీ బేగ్‌తో ప్రతీ కంపార్ట్‌మెంటు ఎక్కి, లోనికి చూసి, దిగి ఆ పక్క పెట్టె ఎక్కుతున్నది. కాస్త ఖాళీగా వున్న చోటు కోసం అని ఎవరికేనా అనిపిస్తుంది. ఆ రోజు, పెళ్ళిళ్ళ కాలం మంచి చాలా రద్దీగా వుంది రైలు.

పాపం ఆ అమ్మాయికి ఎక్కడా స్థలం దొరకడం లేదుగాబోలు. క్రమంగా మేము నిలుచున్న చోటుదాకా వచ్చి, రైలు ఎక్కబోయింది. ఆ పెట్టె ద్వారం వద్దనే నిలుచున్న ఓ సిక్కు, ఈ అమ్మాయిని చూసి,“జాగా నై, దుస్రా డిబ్బాకు జావ్” అని అన్నాడు. ఇది విన్న మా వాసుగాడికి కోపం కట్టలు తెంచుకొని వచ్చింది. వెంటనే ఒక్క ఉదుటున ఎగిరి, ఆ సిక్కు నెక్ టై పట్టుకుని ఒక్క లాగున కిందికి లాగేడు. పాపం వాడు కిందపడ్డాడు. రెట్టింపు రోషంతో మా వాసుతో కలబడ్డాడు. ఇద్దరూ కిందా మీదా ఫైట్లు జరిగాయి. రైల్వే పోలీసులు వచ్చి, వారి పోరు ఆపారు. ఏమయిందని అడిగితే మా వాసు రోషంతో, “చూడండి సార్! ఈ అమ్మాయికి ఎక్కడా స్థలం దొరక్క ఈ పెట్టె ఎక్కుతూంటే, అడ్డుకున్నాడు ఈ సిక్కు ప్రభుద్దుడు. అందుకే కొట్టాను” అన్నాడు. ఆ అమ్మాయి సంభ్రమాశ్చర్యాలతో చూస్తుంటే, పోలీసు అధికారి ఇది నిజమా అని అడిగాడు. ఆమె తడబడుతూ, “కాదుసార్, నేను రైలెక్కడం లేదు, ఏ ఊరూ వెళ్లడం లేదు. మా బంధువులావిడ ఈ మెయిల్లో రావాలి. ఆవిడ అమాయకురాలు, అందుకని ఏ పెట్టెలో వుందో అని ప్రతి పెట్టెలోనికి చూస్తుంటే, ఈయన ఆయన్ని ఒక్క లాగు లాగి దించేశారు” అని తెలియచెప్పేసరికి, మా వాసుగాడి ముఖం నల్లగా మాడిపోయింది.

“చాలా పొరపాటుగా ఆలోచించాను, క్షమించండి సార్” అని ఆ సిక్కుకి క్షమార్పణ చెప్పాడు. అక్కడ అందరిచేతా చీవాట్లు తిన్నాక, వాసుని ఆసుపత్రికి తీసుకొని వెళ్ళాం. ముష్కరుడైన ఆ సిక్కు దెబ్బలకి మా వాడి ఒళ్ళు హూనం అయింది. వాడింట్లో ఎవ్వరికీ చెప్పవద్దని బ్రతిమలాడేడు. వాడిని మా ఇంటికి తెచ్చి వేడినీటి కాపడం వంటి ఉపచారాలు చేశాము. రాత్రి ఎనిమిదింటికి, ఇంటివద్ద దిగపెట్టాం. ఇదీ ఆ ఆదివారం జరిగిన వాసు ఉదంతం. ✵